నేటి దినపత్రిక
# సూర్య
బుధవారం06 డిసెంబర్ 2023 పేజీలు 8
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

# వైయస్సార్ నగర్ అభివృద్ధికి మరో 1.50 కోట్లు నిధులు మంజూరు- ఎంపీ ఆదాల

- యుద్ధ ప్రాతిపదికన తుఫాను సహాయక చర్యలు
- తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి నగర మేయర్ పొట్లూరి స్రవంతి, నగర కమిషనర్ వికాస్ మర్మత్ లతో కలసి విస్తృత పర్యటన
- మిచాంగ్ తుఫాన్ వల్ల తీవ్ర నష్టం
- రెండు రోజుల్లో అన్ని ఇబ్బందులు తొలగిస్తాం
- ప్రజలకు ఆహారపొట్లాలు, తాగునీరు ఏర్పాటు







**నెల్లూరు,మేజర్‌న్యూస్:** మిచాంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు రూరల్ ఇన్చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. మంగళవారం యంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 30వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లో నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్, నెల్లూరు నగర కమిషనర్ వికాస్ మర్మత్, 30 డివిజన్ కార్పొరేటర్ కూకాటి ప్రసాద్ రావు, నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పార్టీ సీనియర్ నాయకులతో కలిసి పర్యటించారు. 30 డివిజన్లోని

మిగతా 2లో

# ప్రాణ ఆస్తి నష్టాన్ని పూర్తిగా నిలువరించాం

## మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి



**వెంకటాచలం (మేజర్ న్యూస్)** మిచౌంగ్ తుఫాన్ హెచ్చరికతో జిల్లా యంత్రాంగం చేపట్టిన ముందస్తు అప్రమత్తత చర్యల వలన జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు. తొలుత గొలగమూడి, అనికేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించిన మంత్రి బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. బాధితులకు దుప్పట్లు, ఆహారం అందజేశారు. అనంతరం వెంకటాచలం సమీపంలోని కనుపూరు చెరువును తుఫాను ప్రత్యేక అధికారి శ్రీ హరికిరణ్, కలెక్టర్ హరి నారాయణన్‌తో

మిగతా 2లో

# మిచౌంగ్ తుఫాన్ ప్రభావముపై స్పెషల్ ఆఫీసర్ శ్రీహరి కిరణ్, జిల్లా కలెక్టర్ పర్యటన



**నెల్లూరు,మేజర్‌న్యూస్:** నెల్లూరు జిల్లా వ్యాప్తంగా మిచౌంగ్ తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసినందున నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాలలో వర్షపు నీటి ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడమైనది. నగరవ్యాప్తంగా వర్షపు నీటి ముంపు ప్రాంతాలను మరియు ఏర్పడిన నష్టమును పర్యవేక్షించుటకు స్పెషల్ ఆఫీసర్ శ్రీ హరి కిరణ్ ఐ.ఏ.ఎస్, జిల్లా కలెక్టర్ శ్రీ హరి నారాయణన్ ఐ.ఏ.ఎస్. వారితో నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీ వికాస్ మరమ్మత్ ఐ.ఏ.ఎస్. గారు, ట్రైనీ కలెక్టర్ సంజనా సింహా ఐ.ఎ.ఎస్. లు మంగళవారం పర్యటించారు. సదరు పర్యటనలో కమిషనర్ నగరంలోని అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీటిని మోటార్స్ ద్వారా

మిగతా 2లో

# బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది





**- యుద్ధ ప్రాతిపదికన చర్యలు**

**- లోతట్టు ప్రాంతాల పర్యటించిన ఎమ్మెల్యే అనిల్**

**నెల్లూరు ,మేజర్ న్యూస్** తుఫాను బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన తుఫాను వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులను పరామర్శించారు. ఎవరు అధైర్య పడవద్దని తెలిపారు. రాష్ట్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తుఫాను

మిగతా 2లో

# ప్రాణ ఆస్తి నష్టాన్ని పూర్తిగా నిలువరించాం





కలిసి మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ముందస్తుగా చేపట్టిన అప్రమత్తత చర్యలు, సమీక్షా సమావేశాల వలన వలన జిల్లాలో ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదన్నారు. కొంతమేర వరినార్లు నీటమునిగాయని, ఉద్యానవన పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయని చెప్పారు. వరి నార్లు దెబ్బతిన్న రైతులకు వెంటనే విత్తనాలను సబ్సిడీపై అందజేస్తామని, నష్టపరిహారాన్ని పూర్తిగా అంచనా వేసి అన్నదాతను ఉదారంగా ఆదుకుంటామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. అలాగే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించామని, కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తాగునీరు, ఆహారం, బ్రెడ్ ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు, పాలు అందజేస్తున్నారని చెప్పారు. పునరావాస కేంద్రాల్లోని ఒక్క కుటుంబానికి 2500 రూపాయలు, ఒంటరిగా వారికి వెయ్యి రూపాయలు ఆర్థిక సాయం అందజేయాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇల్లు నీట మునిగిన ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా 25 కేజీల బియ్యం, పామాయిల్ ప్యాకెట్, కందిపప్పు ఒక కేజీ, ఎర్రగడ్డలు కేజీ, ఉర్లగడ్డలు ఒక కేజీ చొప్పున ప్రతి కుటుంబానికి అందించేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. బలంగా వీచిన ఈదురు గాలుల వలన విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగిందని,సెల్ ఫోన్ల నెట్వర్క్ సమస్యలు ఏర్పడి కమ్యూనికేషన్స్ దెబ్బతున్నాయని, ప్రజలకు ఇబ్బంది లేకుండా యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ చర్యలు జరుగుతున్నాయని చెప్పారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నామని, ప్రజానీకం సాధారణంగా జీవించే పరిస్థితులు ఏర్పడే వరకు అన్ని సహాయక చర్యలు కొనసాగించేలా జిల్లా యంత్రాంగానికి ఆదేశాలిచ్చామని మంత్రి స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అధైర్యపడవద్దని, ప్రతి ఒక్కరికి అండగా నిలిచేలా పనిచేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం కసుమూరు, మనుబోలు, పొదలకూరులోని పునరావాస కేంద్రాలను మంత్రి పరిశీలించారు. మంత్రి వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, రైతులు, స్థానిక ప్రజలు ఉన్నారు.

# పునరావాస కేంద్రాల్లో బాధితులతో మాట్లాడిన ఎమ్మెల్యేసహాయకచర్యలపై ఆర్డీఓకు అభినందనలు



**ఆత్మకూరు, మేజర్ న్యూస్ :**మిచౌంగ్ తుఫాను కారణంగా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో, మండలంలోని కరటంపాడులో మంగళవారం ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి ముమ్మరంగా పర్యటించారు. మున్సిపల్ పరిధిలోని 14వ వార్డు చింతచెట్ల కాలనీలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి పర్యటించిన ఎమ్మెల్యే స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాల వల్ల ప్రజల ఇబ్బందులపై అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

అదే విధంగా మున్సిపల్ పరిధిలోని 21వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే కాలనీవాసులను పరామర్శించి అధికారులు, ప్రజాప్రతినిధులను ద్వారా అందుతున్న సహాయ సహకారాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియచేయాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వర్షాల పట్ల అందరిని అప్రమత్తం చేశారని వివరించారు.

అనంతరం మండలంలోని కరటంపాడు ఎస్టీ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే మేకపాటి అక్కడ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. వారితో మాట్లాడి వర్షాలకు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బిస్కెట్లు అందచేశారు.

**ఆర్టీఓకు అభినందన**

మిచౌంగ్ తుఫాను వర్షాల కారణంగా ఆత్మకూరు నియోజకవర్గ వ్యాప్తంగా సహాయకచర్యల్లో ముమ్మరంగా పాల్గొన్న ఆత్మకూరు ఆర్డీఓ కె మధులతకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఆత్మకూరు పట్టణ పర్యటనలో భాగంగా ఆర్డీఓతో మాట్లాడిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డికి తుఫాను సహాయక చర్యలపై అడిగి తెలుసుకున్నారు.పునరావాస కేంద్రాల్లో బాధితులకు అందచేస్తున్న సహాయక చర్యలపై, ఇతర నష్ట నివారణ చర్యలపై అడిగి తెలుసుకున్నారు. తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధులత, మండలాధ్యక్షుడు, జిల్లా మండలాధ్యక్షుల సంఘ అధ్యక్షుడు కేతా వేణుగోపాలరెడ్డి, వి ఆర్వో ప్రతాప్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మిచౌంగ్ తుఫాన్ ప్రభావము పై స్పెషల్ ఆఫీసర్ శ్రీహరి కిరణ్, జిల్లా కలెక్టర్ పర్యటన



తొలగించుట, కూలిన వృక్షములను తొలగించుట లోతట్టు ప్రాంతాలలో కాలువల పూడికతీత మరియు అడ్డులను తొలగించుటకు చేపట్టిన అత్యవసర పనులను వివరించినారు.నగరంలో తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు వలన ఏర్పడిన ప్రతికూల పరిస్థితుల పునరుద్ధరణ కొరకు నగరపాలక సిబ్బంది యావన్మంది యుద్ధ ప్రాతిపదికన పనిచేయుచున్నారని సాధ్యమైనంత త్వరలో సాధారణ పరిస్థితులను నెలకొల్పుతామని కమిషనర్ తెలియజేశారు.

## బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడం జరిగిందన్నారు. నగరంలో దెబ్బతిన్న ప్రాంతాలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ముంపు నకు గురైన ప్రాంతాలైన మన్సూర్ నగర్, కొద్దూస్ నగర్, కుసుమ హరిజనవాడ, స్టోన్ హౌస్ పేట, వెంకటేశ్వరపురం, గుర్రాల మడుగు సంఘం వంటి ప్రాంతాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులను పరామర్శించారు. మీకు అండగా నేనున్నానని ఆయన భరోసా ఇచ్చారు.

## వైయస్సార్ నగర్ అభివృద్ధికి మరో 1.50 కోట్లు నిధులు మంజూరు- ఎంపీ ఆదాల



వైఎస్ఆర్ నగర్ ను ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి సందర్శించి తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఆ ప్రాంత ప్రజలకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను అందించి తాగునీరును ఏర్పాటు చేశారు. అనంతరం యంపి ఆదాల మీడియాతో మాట్లాడారు. రెండు రోజుల్లో అన్ని సమస్యలను పూర్తి స్థాయిలో తొలగించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని యంపి ఆదాల చెప్పారు. తుఫాను వల్ల జిల్లా ప్రజలకు చాలా నష్టం జరిగిందని యంపి ఆదాల తెలిపారు. వైఎస్ఆర్ నగర్ తో పాటు, రూరల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో తుఫాన్ వలన దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీ కాలువలు,ఇతర కార్యక్రమాలు త్వరితగతిన పునర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా తుఫాను వల్ల అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని తద్వారా ప్రజలకు చాలా ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడ్డాయని ఎంపీ ఆదాల తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షులు టీవీయస్ కమల్, తురక సూరిబాబు, ముతంగి రామయ్య, పార్టీ సీనియర్ నాయకులు స్వర్ణ వెంకయ్య, సిహెచ్ హరిబాబు యాదవ్, చెన్నారెడ్డి నవీన్ కుమార్ రెడ్డి, పాలకీర్తి రవికుమార్, పొట్లూరి జయవర్ధన్, నాయబ్ రసూల్, వై శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, స్థానిక వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గిరిజన కుటుంబాలకు ఆహారం పంపిణీ



**అనంతసాగరం ( మేజర్ న్యూస్)** అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు గ్రామంలోని 30 మంది గిరిజన కుటుంబాలకు సర్పంచ్ కత్తి లావణ్య మంగళవారం టిఫిన్, ఆహారాన్ని అందజేశారు. గత రెండు రోజులుగా ఎడతెగకుండా వస్తున్న బీకర వర్షానికి ఇంటిలో కట్టే రగల్చలేని స్థితిలో ఉన్న కుటుంబాలకు తన వంతు సహకారం అందించారు. కార్యక్రమంలో వీఆర్వో పెంచలయ్య పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే



**అనంతసాగరం ( మేజర్ న్యూస్)** అనంతసాగరం మండలం రేవూరు పాతదేవరపల్లి అనంతసాగరం గ్రామాల్లోని తుఫాన్ బాధితుల పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. అధికారులు కేంద్రాలలో చేపట్టిన వసతులను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. తుఫాను మరల కొనసాగితే ఎలాంటి పటిష్ట చర్యలు చేపట్టాలి అన్న విషయంపై చర్చించారు. రేవూరులోని బిసి వస్తే గృహాన్ని పరిశీలించి వార్డెన్ కు పలు సూచనలు చేశారు. అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ అక్కల రెడ్డి అంకిరెడ్డి, వైసీపీ నాయకులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తుఫాను బాధితులకు దుప్పట్లు పంపిని చేసిన సర్పంచ్ వెంగపనాయుడు



**మేజర్ న్యూస్ కలిగిరి** కలిగిరి మండలం లోని రావులకొల్లు గ్రామం లో సర్పంచ్ పూసాల వెంగపనాయుడు , ఉదయగిరి మాజీ శాసనసభ్యులు బొల్లినేని వెంకట రామారావు ఆదేశాల మేరకు యస్. టి. గిరిజన కుటుంబాలకు తుఫాను కారణంగా నివాస ప్రాంతాలు ఈదురు గాలులకు స్వల్పంగ దెబ్బతినడంతో సర్పంచ్ వెంగపనాయుడు , మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు సహకారం తో 30 కుటుంబాలకు భోజనం వసతి కల్పించి బాధితులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేశారు . ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని సహాయం చేసిన వారికి అభినందనలు తెలిపారు.

# తుఫాను బాదిత కుటుంబాలకు అండగా : జనసేన



**నెల్లూరు మేజర్ న్యూస్** నెల్లూరు 41వ డివిజన్ దామాయ దిబ్బ నగరం లోని ప్రధాన కాలవలన్నీ దురాక్రమణకు గురవడం వల్లే మాకు ఈ దుస్థితి మిచౌంగ్ తుఫాన్ వల్ల గత రాత్రి నడుము లోతు నీటి లో ఇంట్లో ఇరుక్కుపోయిన గిరి పుత్రులకు జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నాగబాబు అజయ్ నాదెండ్ల మనోహర్ పిలుపు తో వెజిటబుల్ బిరియాని నీరు బాటిల్స్ బ్రెడ్డు పాకెట్ అందించి పరామర్శించిన జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఈ సందర్భంగా వారితో చర్చించిన ముఖ్యాంశాలు పరమేశ్వరి నగర్ అంతా కూడా పది అడుగుల నీటితో మునిగిపోయి ఆ నీరంతా కూడా వెళ్లేందుకు గత ఐదు సంవత్సరాలు ముందు ఇక్కడ తూము నిర్మించారు నగరం గుండా పెద్ద కాలువలు గుండా వెళ్లాల్సిన నీరంతా కూడా కాలవలు దురాక్రమంగా కావడం వల్ల అటుపక్క ప్రవహించకుండా నీరు మొత్తం వీరి ఏరియా కి వచ్చి వావ వచ్చినప్పుడల్లా మా ఏరియా ముంపు కి గురి అవుతుంది వైసీపీ కార్పొరేటర్లు నీట మునిగినప్పు డల్లా వచ్చి కొంత మందికి ఆహర పొట్లాలు ఇవ్వడం కాకుండా ఈ సమస్యకు శాశ్వత పరిహారం చూపోవాల్సిందిగా వారు కోరారు ఈ సమస్య కేవలం ఎన్నో సంవత్సరాలుగా దేవునికి సేవ చేస్తున్న ఈ గిరి పుత్రులది మాత్రమే కాదు నెల్లూరు నగర ప్రధాన కాలువైనటువంటి గచ్చి కాలువ ఉయ్యాల కాలువ దురాక్రమణ కు గురై నీరు వాటి కుంటే గుండా ప్రవహించక ఎక్కడ నీరు అక్కడే ఉండిపోయి నగరం మొత్తం నీటితో నిండిపోతుంది స్థానిక నాయకులు మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది తగు చర్యలు తీసుకొని రాబోయే విపత్తులను దృష్టిలో ఉంచుకొని కాలవల దురాక్రమణలు తొలగించి చినుకు పడితే నీటి ఎద్దడి కాకుండా నగరాన్ని రక్షించాల్సిన బాధ్యత తీసుకోవాల్సింది తుఫాన్ బాధితులకు జనసైనికులు అఅందరూ కూడా తమవంతు సహాయకారిగా నిలబడ్డారు ఎక్కడైనా ఆహారం నీరు అందక ప్రజల ఇబ్బందులో ఉంటే తమ దృష్టికి తీసుకురావలసిందిగా కోరారు

# తుఫాన్ వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్న జనం అధికారులు



**డక్కిలి మేజర్ న్యూస్:** గత నాలుగు రోజులుగా మీచౌంగ్ తుఫాన్ కు డక్కిలి మండలంలో పెద్దగా ప్రమాదాలు, నష్టాలు లేకపోవడంతో ప్రజలు, అధికారులందరూ ఊపిరి పీల్చుకున్నారు. మొన్నటివరకు రైతాంగం వర్షం కోసం ఎదురు చూసినవారు చెరువులన్ని నిండుకోవడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు,దగ్గవోలు,మార్ల గుంట, సంగనపల్లి గిరిజన కాలనీ వాళ్లకు ఆహారం, పాలు, మందులను సరఫరా చేశారు, నరస నాయుడు పల్లి కొత్తచెరువుకు రెండు చోట్ల గండి పడడంతో తాహిసిల్దార్ రమేష్ బాబు గండి పూడ్చే చర్యలు చేపట్టారు. మండలంలో సుమారు 50 విద్యుత్ స్తంభాల వరకు నేలకొరిగినట్లు, శ్రీపురం, సంగనపల్లి గ్రామాల్లో రెండు ట్రాన్స్ఫార్మర్లు కాలిపోయాయని సబ్ ఇంజనీర్ అశోక్ తెలిపారు. విద్యుత్తు పునర్దన కోసం మండలంలో ఐదు సబ్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ విద్యుత్తు మరమ్మతులు చేపట్టి విద్యుత్ నూ పునర్దించారు. మరొకవైపు ఎంపీడీవో ప్రసన్నకుమారి, తాహిసిల్దార్ రమేష్ బాబు మండల వ్యాప్తంగా తుఫాన్ నష్టాలను పరిశీలిస్తున్నారు. సోమవారం ఉదయం నుండి మంగళవారం ఉదయం వరకు మండలంలో సుమారు 17 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. సోమవారం రాత్రి లింగసముద్రం వద్ద నేషనల్ హైవే రోడ్డుకు అడ్డంగా భారీ వృక్షాలు నేలకొరకడంతో సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు అప్పటికప్పుడు చెట్లను తొలగించి ట్రాఫిక్ ను పునరుదించారు. అదేవిధంగా వైకాపా మండల జెఏసి కన్వీనర్ చింతల శ్రీనివాసులురెడ్డి తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి డక్కిలి గురుకుల కళాశాల వద్ద చెట్లు పడిపోవడంతో వాటిని తొలగించుటకు సహకరించారు,జిల్లాలో తుఫాన్ ప్రభావం పెద్దగా ఉన్న డక్కిలి మండలంలో ప్రశాంతంగా గండం తప్పింది.

# తెలుగురాయపురంనుంచి కలువాయ రాకపోకలు బంద్



## విద్యుత్ లేక తాగునీరు లేక అల్లాడు తున్న ప్రజలు

**కలువాయ మేజర్ న్యూస్** బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో రాత్రి నుంచి కలువాయి మండల వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురుస్తుంది.దీని వలన తెలుగురాయ పురం గ్రామంలో పడమటి చెరువు నిండడంతో అలుగు పారడం తో పుచ్చకాయ బొంద బ్రిడ్జ్ దగ్గర వరదరావరడం తో తెలుగురాయపురం నుంచి కలువాయ కు రాకపోకలు ఆగిపోయినాయి. తాగునీటికి అష్ట కష్టాలు పడుతున్నారు. మండలం లో విద్యుత్ అధికారారులు, సమస్య ను పరిస్థితి ను పట్టించు పరిస్థితులు లేనట్లు ఉన్నాయి. కలువాయి మండలం లో ఎడ తెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈదురు గాలులతో భారీ వర్షం కురుస్తుంది. భారీ వర్షం నేపథ్యంలో



కలువాయి మండలంలో గ్రామాల్లో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గాలులకు అరటి, తమలపాకుల తోటలు నేల మట్టం అయ్యాయి. చెట్లు, స్థంబాలు నేల కు వరిగాయి. వరద బీభత్సవాన్ని తహసీల్దార్ స్వర్ణ పరిశీలించి వాగులలో ప్రవాహం ఉన్నందువలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు .చిన్నపిల్లలను బయటకు రాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.పెన్నానది లో నివాసం ఉన్న 25 మంది గిరిజనులను తహసీల్దార్ స్వర్ణ సురక్ష త ప్రాంతాలకు తరలించారు. కలువాయి చెరువు అలుగులు ప్రవాహించిన నీరు పొలాల పై ప్రవహిస్తున్నాయి. వరి నారు మడులు, డ్రమ్ సేద్యం చేసిన విత్తనాలు నీటి ప్రవాహం నికి కొట్టుకపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# ఆత్మకూరులో గాలీ,వానా భీభత్సం













## -జనజీవనం అస్థవ్యస్తం
## -విరిగిన చెట్లు, ఒరిగిన విద్యుత్‌స్థంభాలు
## -నీటమునిగిన నారుమళ్ళు
## -చెరువులకు జలకళ, రైతుల్లో కళకళ

**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరులో శుక్రవారం పగలు, రాత్రి భారీ వర్షాలు కురవగా నానాభీభత్సం సృష్టించాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు అని అధికారులు హెచ్చరికలు చేస్తుండగా నాలుగురోజులుగా ఆత్మకూరులో వర్షం మాత్రం స్వల్పంగా కురవగా సోమవారం ఓమోస్తరుగా, రాత్రికి భారీగా కురిసింది. పెనుగాలులు, భారీ వర్షంతో పట్టణం అతలాకుతలమైంది. అందరూ తీవ్ర ఆందోళనకు గురయ్యారు.వర్షాభావంతో దిగాలుచెందిన రైతన్నల కళ్ళల్లో సంతోషం వ్యకతమవుతుండగా సాధారణ ప్రజలు నానా అవస్థలు పడ్డారు. లోతట్టు ప్రాంతాల కాలనీల్లోకి నీరు ప్రవేశించచడం, విద్యుత్ స్థంభాలు అక్కడక్కడా ఇరిగిపడడం, చెట్ల కొమ్మలు ఇళ్ళపై పడడం, విద్యుత్‌సరఫరా సోమవారం సాయంత్రం నుండి మంగళవారం సాయంత్రం వరకు లేకపోవడం, అనేకమంది ఇళ్ళలో ఉండలేని పరిస్థితి, వంటచేసుకునే అవకాశం లేకపోవడం తదితర కారణాలతో ఉన్నపళంగా జనజీవనం అస్థవ్యవస్థంగా మారింది. స్థానిక ఆర్డీవో కె.మధులత ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు 24గంటలపాటు అందుబాటులో ఉండేలా సిబ్బందిని నియమించారు. జోరువాన, హోరుగాలిసైతం లెక్కచేయకుండా ఆమె స్వయంగా లోతట్టుప్రాంతాల కాలనీలను పరిశీలించడం, అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ఆమె స్వయంగా పాల్గొని సేవలందించడం, నీరునిల్వ ఉన్న కాలనీల్లో జెసిబితో ఆనీటిని వెలుపలకు పంపేలా స్వయంగా అక్కడే ఉంటూ పర్యవేక్షించడం, సురక్షిత ప్రాంతాలకు చేర్చిన వారికి తాగునీరు, ఆహారవసతులు కల్పిండంలో అత్యంత చురుగ్గా,శ్రద్ధగా పాల్గొన్నారు. స్తానిక 7వవార్డు పరిధిలో ఒక చెట్టు ఇంటిపైకి కూలడంతో ఇంటిగోడ ధ్వంసంకాగా ఆప్రాంత కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్‌బేగమ్, ఆమె భర్త వైసిపి నాయకుడు సయ్యద్ జమీర్‌బాషాలు హుటాహుటిన అక్కడ చెట్టును తొలగించే చర్యలు తీసుకున్నారు. స్థానిక 14వవార్డు పరిధిలోని కొలగానిసత్రం ప్రాంతంలో ఒక ఇంటిపైకి చింతచెట్టు పడడంతో ఆవార్డు కౌన్సిలర్ పొడమేకల పెంచలయ్యయాదవ్ అక్కడకు చేరుకొని ఆఇంటివారిని ఇతర సురక్షిత ప్రాంతానికి తరలించి చెట్టును తొలగించే చర్యలు తీసుకున్నారు. మండలంలోని వాసిలిలో కాలనీలో విద్యుత్‌స్థంభం విరిగిపడగా అందరూ ఆందోళనకు గురవ్వగా సర్పంచ్ చెలికా రమాహరిబాబు యుద్ధప్రాతిపదికన తగు చర్యలు తీసుకున్నారు. ఆత్మకూరు పట్టణంలో సోమవారం సాయంత్రం నుండి విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడగా విద్యుత్ అధికారులు, సిబ్బంది నానా అవస్థలుపడి మరమ్మత్తులు చేయడం, విరిగిపడిన చెట్లను తొలగించి సరఫరా ఇవ్వబోవడం, ఆగిపోవడం, మళ్ళీ వారు వర్షంలోనే తిరిగి తిరిగి సరిచేసి ఎట్టకేలకు మంగళవారం సాయంత్రానికి సరఫరాను పునరుద్ధరించారు. ఇటీవలదాకా ఆత్మకూరు డివిజన్‌లో వర్షం కురవక, సోమశిల జలాశయంలో నిరు స్వల్పంగా ఉంటూ చెరువుల్లో చుక్కనీరు లేని పరిస్థితి కాగా తుఫాన్‌ప్రభావంతో భారీ వర్షం కురవడంతో చెరువులకు నీరుచేరి మరో రెండురోజుల్లో నిండేపరిస్థితి కన్పిస్తోంది. సోమశిల జలాశయానికి కూడా పైతట్టు ప్రాంతాలనుండి నీరు వచ్చి చేరుతూ ఒక టిఎంసి నీరు పెరిగింది. మంగళవారం ఉదయం డివిజన్‌లోని సీతారామపురం మండలంలో 72మ.మీ, ఉదయగిరి మండలంలో 128.4మి.మీ, మర్రిపాడు మండలంలో 147.6మి.మీ, ఆత్మకూరు మండలంలో 193.2మి.మీలు, ఏఎస్‌పేట మండలంలో 132.4మి.మీ, సంగం మండలంలో 220.6మి.మీ, చేజర్లమండలంలో 139.4మి.మీ, అనంతసాగరం మండలంలో 195.8మి.మీ, కలువాయి మండలంలో 192.8మి.మీలు వర్షపాతం నమోదైంది. సోమశిల జలాశయానికి 10195క్యూసెక్కుల వంతున నీరు వచ్చిచేరుతుండగా జలాశయంలో నీటినిల్వ 30.756టిఎంసిలుగా ఉంది. ఇటీవలదాకా 29టిఎంసిలు నీరే ఉండగా గణనీయంగా పెరుగుతోంది. ఆత్మకూరులో కూడా రోజూ 10నుండి20మి.మీల వర్షపాతం నమోదవుతుండగా సోమవారం రాత్రి గణనీయంగా 193.2మి.మీల వర్షపాతం నమోదుకావడం గమనార్హం కాగా రైతుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.

# తుఫాన్‌బాధిత 1000మందికి డాక్టర్ శ్రావణ్ భోజన ఏర్పాటు

**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు లోతట్టుప్రాంతాల్లో తుఫాన్‌తికిడికి గురయిన ప్రజలకు స్థానిక అభిరామ్‌మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, మున్సిపల్ వైస్‌చైర్మెన్ డాక్టర్ కె.వి.శ్రావణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం తన స్వంత నిధులతో దాదాపు 1000మందికి భోజనవసతి కల్పించారు. ఆయన సోమ,మంగళవారాల్లో లోతట్టు కాలనీల్లో ముమ్మరంగా పర్యటించి బాధిత ప్రజలను పరామర్శించారు. పలుకాలనీల్లో భారీవర్షప్రభావంతో నీరు ప్రవేశించి వంట వండుకునే పరిస్థితిలేకపోవడాన్ని డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి గుర్తించారు. మున్సిపల్ పరిధిలోని మాడల్‌ఎస్‌టి కాలనీ, సెయింట్‌మేరీస్‌స్కూలు ఎదుట ఎస్‌టికాలనీ, వెంకట్రావుపల్లి ఎస్‌టికాలనీల్లో 1000మందికి ఆయన భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధిగా తనవంతుగా బాధిత ప్రజలకు భోజనసౌకర్యం కల్పించి మానవత్వం చాటుకున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డికి వారంతా కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మానవతా ధృక్పధాన్ని ఆయా ప్రాంత



ప్రజాప్రతినిధులు, నాయకులు కొనియాడారు. తనవంతుగా ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలన్న తలంపు, సంకల్పంతో వరదబాధిత గిరిజన కుటుంబాలవారికి భోజనవసతి కల్పించానని, ఎంతో సంతృప్తిగా ఉందని



డాక్టర్ కె.వి.శ్రావణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ దగ్గుమాటి శివకోటారెడ్డి, వైసిపి నాయకులు ముజీబ్, అభిరామ్ హాస్పిటల్ పిఆర్వో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం పరిమళింపజేసిన ఆర్డీవో మధులత సేవలు










**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** విధుల నిర్వహణ ఓవైపు.... మానవత్వ ధృక్పథం మరోవైపు.... ఆపదలోని వారిని ఆదుకోవాలన్న ఆతృత..... సేవలందించాలన్న సంకల్పం.....అన్నీమేళవించిన ఆత్మకూరు ఆర్డీవో కె.మధులత తుఫాన్‌సందర్భంగా కురుస్తున్న భారీ వర్షాలు, పెనుగాలులల సందర్భంగా అనూహ్యంగా, అపారంగా మానవతాకోణంలో ఆమె అందించిన సేవల్లో మానవత్వం పరిమళించింది. సర్వత్రా ముక్కుమీద వేలేసుకొని ఇలాంటి అధికారిణి కూడా ఉంటారా అంటూ ఆమె అందించిన సేవలను కొనియాడి మన:పూర్వక అభినందనలు తెలియజేశారు. గత వారంరోజులుగా అల్పపీడనం, తుఫాన్ అంటూ భారీవర్షాలు, విపరీతమైన గాలులు ఉంటాయని హెచ్చరికలు వెలువడగా ఆ మరుక్షణంనుండే ఆర్డీవో తాను అప్రమత్తమయ్యారు. అధికారులందరిని అప్రమత్తం చేశారు. 24గంటలు అందుబాటులో ఉండేలా ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. నిరంతరం ఆమె డివిజన్‌వ్యాప్తంగా పర్యవేక్షించసాగారు. కాగా సోమవారం మరింతగా పెనుగాలులు వీయడం, భారీ వర్షాలు కురవడంతో డివిజన్‌లోని పలుప్రాంతాల్లో లోతట్టు కాలనీల్లోకి నీరు ప్రవేశించాయి. ఆర్డీవో స్వయంగా ఆకాలనీలను జోరువాన, హెూరుగాలిసైతం లెక్కచేయకుండా పర్యటించి పరిశీలించారు. సురక్షిత కేంద్రాలను ఏర్పాటుచేయించారు. వర్షపుతాకిడి ప్రజలను అక్కడికి తరలింపజేశారు. అక్కడ వారికి తాగునీరు, భోజన వసతులు సక్రమంగా ఉండేలా అధికారులను ఆదేశించారు. కరటంపాడు ఎస్టీకాలనీలో తాటాకుగుడిసెల్లో నివాసాలుంటున్న వారిని సమీప సురక్షిత అంగన్‌వాడీ భవనంలోకి తరలించే ఏర్పాట్లు చేయించి ఆమె స్వయంగా పాల్గొని వారిని తరలిస్తున్న తరుణంలో ఒక మహిళ తన చంటిబిడ్డను చంకనపెట్టుకొని రావడంతో స్పందించిన ఆర్డీవో మధులత ఆమె వేసుకున్న గొడుగును ఆ చంటిబిడ్డకు వేశారు. అనంతసాగరం మండలంలో కొందరిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న తరుణంలో ఒక చంటిబిడ్డను ఆర్డీవో తానే స్వయంగా తీసుకొని తన చంకబెట్టుకొని తరలించారు. కాలనీల్లో నీరునిల్వ చేరిన చోట ఆమె పాల్గొని .జెసిబితో నీటిని వెలుపలకు తరలించే కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు. సురక్షిత కేంద్రాలను ఆమె పరిశీలించడంతోపాటు స్వయంగా వారికి భోజనం కూడా వడ్డించారు. ఆత్మకూరులో నూతనంగా ఇటీవలనే ఆర్డీవో బాధ్యతలు చేపట్టిన యువ అధికారిణి మధులత ఆమె ఇక్కడ చేరిననాటనుండే విధులను అత్యంత అంకిభావంతో చిత్తశుద్ధిగా నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదేశాలు, నిర్ణయాలు తుచ తప్పకపాటిస్తూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న స్పందన కార్యక్రమ నిర్వహణ తీరునే మార్చి ప్రజలకు ప్రయోజనకరంగా ఉండేలా మార్పు తెచ్చారు. రెవిన్యూ సమస్యల పరిష్కారం పట్ల ఆమె ప్రత్యేక దృష్టి సారించి ప్రాధాన్యతా క్రమంలో చర్యలు తీసుకుంటున్నారు. కాగా ప్రకృతివైపరీత్యాల సమయంలో ఆమె ఒక అధికారిణిగా ఉంటూ మండల స్థాయి అధికారులకు సూచనలు చేస్తూ ఉండే పరిస్థితిని సమూలంగా మార్చి తనవంతు సేవలందించి మానవతామూర్తిగా అందరిచేతా శెహభాష్ అన్పించుకున్నారు. మొత్తంమీద ఈ తుఫాన్ సమయంలో ఆత్మకూరులో ఆమె ఒక అధికారిణిగానే కాకుండా ఓ సేవానిరతి, మానవతా నైజం కలిగిన మహిళగా ఆమెను సర్వత్రా కొనియాడుతుండడం విశేషం, గమనార్హం.

# తుఫాన్‌తాకిడి ప్రాంతాల్లో ఎమ్మెల్యే మేకపాటి పర్యటన

## బాధితులందరినీ ఆదుకుంటామని హామీ -ముమ్మరంగా సత్వరసహాయకచర్యలు







**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరు నియోజకవర్గంలో తుఫాన్‌తాకిడి ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మంగళవారం ముమ్మరంగా పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో సోమవారం పగలు, రాత్రి పెనుగాలులు వీయడం, భారీగా వర్షం కురవడం, పలు తీరప్రాంత, లోతట్టు ప్రాంతాల్లో వరదనీటి తాకిడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పలుచోట్ల గాలులకు చెట్లు విరిగి ఇళ్ళపై పడడం తదితర పరిణమాలు చోటుచేసుకున్నాయి. భారీవర్షం, పెనుగాలలతో జనజీవనం భీభత్సంగా మారింది. కాగా శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి అనంతసాగరం మండలంలోని తీరప్రాంతాల్లో పర్యటించారు. ఆత్మకూరు చెరువును, పట్టణంలోని వరదతాకిడికి గురైన కొలగానిసత్రం, 7వవార్డు, మాడల్‌ఎస్టీకాలనీ, తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి అందరినీ పరామర్శించారు. సురక్షిత కేంద్రాల్లో కూడా ఆయన పర్యటించి అక్కడకు తరలించిన వారిని పరామర్శించారు. వారికి తాగునీరు, భోజనవసతుల ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. పరిస్థితిని స్థానిక ఆర్డీవో కె.మధులతతో చర్చించి వివరాలు తెలుసుకొని సహాయకచర్యల గురించి సమీక్షించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో ఇబ్బందిపడుతున్న ప్రతి ఒక్కరినీ ఆదుకునేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారన్నారు. చెరువులకు ఈవర్షంతో జలకళ సంతరించుకోవడం సంతోషదాయకమి ఆయన పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో ఆత్మకూరు నియోజకవర్గంలో 250మి.మీల వర్షపాతం నమోదైందని, ప్రజలు ఇబ్బందిపడకుండా అధికారులు అన్నీ ముందస్తు చర్యలు తీసుకునేలా చేశామని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 12 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి వరదబాధిత ప్రజలను అక్కడకు తరలించామన్నారు. వారికి భోజన,బస వసతులతోపాటు ఆర్థికసాయమందించేలా ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలిచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పంటనష్టాలను వెంటనే సేకరించి నివేదికలను అందజేసేలా ఆదేశించామన్నారు. సోమశిల జలాశయంతోపాటు సంగం బ్యారేజికి కూడా నీరు చేరిందని, చెరువులకు నీరు చేరిందని ఆయన పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రైతాంగానికి సాగునీటి విషయమై గతంలోనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళానని, 50వేల ఎకరాలకు సాగునీరు అందించాలని కోరానన్నారు. ఈ వర్షాలతో అధికంగా నీటిని అందజేసే అవకాశం ఉందని విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో సత్వరమే పంటనష్టం అంచనాలు వేస్తారని, దెబ్బతిన్న రోడ్లు, విరిగిన విద్యుత్‌స్థంభాలు తదితరాల పునరుద్ధరణకు సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో కె.మధులత, మున్సిపల్ కమీషనర్ బి.నాగేశ్వరరావు,ఆత్మకూరు మండలాధ్యక్షుడు , జిల్లా మండలాధ్యక్షుల సంఘ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌ఛైర్మెన్లు డాక్టర్ కె.వి.శ్రావణ్‌కుమార్‌రెడ్డి, షేక్ సర్దార్, తహశిల్దారు జగదీష్‌బాబు, వివిద శాఖల అధికారులు, వైసిపి నాయకులు కౌన్సిలర్‌లు పొడమేకల పెంచలయ్యయాదవ్, సయ్యద్ నౌషాద్‌బేగమ్, వైసిపి నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, సయ్యద్: జమీర్‌బాషా, ముజీబ్, మున్సిపల్ ఏయి జూపల్లి ప్రసాద్, ఆర్‌ఐ సయ్యద్ ఖాసిమ్, పలువురు అధికారులు, వైసిపి నాయకులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు ఆహార పొట్లాలు,మంచినీరు అందజేత-ఎమ్మెల్సీ పర్వత రెడ్డి.



నెల్లూరు మేజర్ న్యూస్: తుఫాను కారణంగా నీటిలో చిక్కుకుపోయిన నెల్లూరు ఇందిరమ్మ కాలనీ, సుందరయ్య కాలనీ, ప్రాంతాలలో రెండో రోజు వరద బాధితులకు, ఆహార పొట్లాలు, మంచినీరు చైర్మన్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాను కారణంగా నిరాశ్రయులైన వరద బాధితులకు రెండో రోజు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిరంతరాయంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు.ఇందిరమ్మ కాలనీ సుందరయ్య కాలనీ ప్రాంతాలలో వరద బాధితులకు ఆహార పొట్లాలు,మంచినీరు అందజేశామని తెలిపారు.తుఫాను తగ్గేవరకు తమ సేవలు కొనసాగుతూ ఉంటాయని చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి తెలియజేశారు.రెడ్ క్రాస్ డిజాస్టర్ మేనేజ్మెంట్ కమిటీ కన్వీనర్ భాస్కర్ రెడ్డి, కమిటీ మెంబెర్ జనార్దన్ రాజు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న కాలువలకు సత్వరమరమ్మత్తులు





ఇరిగేషన్ ఇ.ఇ "రావూరు"

ఆత్మకూరు,మేజర్‌న్యూస్: ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువులు, కాలువలకు సత్వర మరమ్మత్తులకు చర్యలు తీసుకుంటామని స్థానిక ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రావూరు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆయన మంగళవారం ఆత్మకూరు, అనంతసాగరం, మర్రిపాడు తదితర మండలాల్లో ముమ్మరంగా పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో ఆత్మకూరు నియోజకవర్గంలో భారీగా3 వర్షం కురవడంతోపాటు పెనుగాలులు వీడం తెల్సిందే. ఈనేపధ్యంలో నియోజకవర్గంలోని చెరువులు, కాలువలు, తూములు, తదితరాలను ఆయన పరిశీలించారు.భారీ వర్షాలకు నందవరం వద్ద కాలువకు చిన్నపాటి గండి పడిందని, మరెలాంటి నష్టాలు లేవని, అయినా వర్షాలు తగ్గాక అన్నింటిని నిశితంగా పరిశీలించి నివేదికలు రూపొందించి కలెక్టర్‌కు సమర్పిస్తామని, వరదసహాయక నిధులతో సత్వర మరమ్మత్తులను అవసరమైనచోట్ల చేపడతామని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వర్షాభావంతో రైతులు ఆవేదనతో ఉండగా తాజాగా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు అటు సోమశిల జలాశయానికి నీరు పెరుగుతున్నాయని, చెరువులకు నీరు చేరాయని, మరో రెండు రోజుల్లో ఆత్మకూరు, వాసిలి తదితర చెరువులు నిండే అవకాశం ఉందని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రైతులకు సమృద్ధిగా సాగునీరందించేలా అన్నీ చర్యలు తీసుకుంటామని కూడా ఇ.ఇ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ డియియి లీలాకుమారి, ఏయిలు యాసిన్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

# తుఫాన్‌బాధితులకు "కంచి" భారీ అన్నదానం



ఆత్మకూరు,మేజర్‌న్యూస్: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో నిత్యాన్నదానం, మున్సిపాలిటీలో మృతుల కుటుంబాలకు 10వేల రూపాయల వంతున ఆర్థికసాయమందిస్తున్న దాత, శ్రీసాంభశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం తుఫాన్‌బాధితులకు భోజనసౌకర్యం కల్పించారు. తుఫాన్ ప్రభావిత, తాకిడి ఉన్న ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని శాంతినగర్, నరసాపురం , మున్సిపల్ బస్టాండు, కొలగానిసత్రం ఏరియాల్లో 400మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కంచిపరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ట్రస్ట్ కార్యక్రమాలు పర్యవేక్షణా ప్రతినిధి మల్లవరపు జయేంద్రప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా కాలనీల్లో భోజనం సమకూర్చి అందజేశారు. ఇప్పటికే హిస్పిటల్‌లో నిత్యం ఏడెనిమిది వందలమందికి అన్నదానం చేస్తున్న కంచిపరమేశ్వరరెడ్డి తుఫాన్‌బాధిత ప్రజలకు కూడా అన్నదానం ఏర్పాటుచేయడంపట్ల ఆయన మానవతాధృక్పధాన్నివారంతా కొనియాడి హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

## ఫారెస్ట్ లో చిక్కుకుపోయిన కార్మికులు సురక్షిత ప్రాంతానికి తరలింపు



వరికుంటపాడు మేజర్ న్యూస్: మండల పరిధిలోని కాంచెరువు ఫారెస్ట్ నందు జామాయిల్ చెట్లను కొట్టేందుకు కందుకూరు నుండి వచ్చినటువంటి కార్మికులు 21 మంది పెద్దలు 16 మంది చిన్నారులు వర్షానికి తడుస్తూ అవస్థలు పడుతుండటం గమనించిన పంచాయతీ కార్యదర్శి జిలాని రెవెన్యూ విఆర్ఓ ఆంతోని బాబు కలిసి ఫారెస్ట్ లోకి వెళ్ళి ఆ కార్మికులను సురక్షితంగా కాంచెరువు గ్రామానికి తీసుకొని వచ్చి సచివాలయ భవనంలో వారికి వసతి ఏర్పాటు చేశారు. వారు ఉండేందుకు కావలసినటువంటి ఏర్పాట్లను ఆహార పదార్థాలను అందజేశారు. అదేవిధంగా గ్రామంలోని పాత పాఠశాల భవనం కూడా ఈ వర్షానికి పడిపోయిందని గ్రామాలలోని ప్రజలు సురక్షిత ప్రాంతాలలో ఉండాలని వర్షం అధికంగా ఉందని వర్షం తగ్గేంతవరకు ప్రజలు ఎవరూ కూడా బయటకు రావద్దని సూచించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఉదయగిరిమేజర్ న్యూస్.తుఫాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త మేకపా రాజగోపాల్ రె డ్డి పేర్కొన్నారు మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉపాధ్యాయులతో మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. పాఠశాల ప్రాంగణంలో శిథిల భవనాలు ఉన్నందున అటువైపు విద్యార్థులు వెళ్లకుండా చూడాలన్నారు. విద్యార్థులు బయటకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. అలాగే జలాశయాన్ని సందర్శించి అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షణ చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మండల కన్వీనరు జి. ఓబుల్ రెడ్డి మాజీ ఏఎంసీ చైర్మన్ అలీ అహమ్మద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కనుపూరు కెనాల్ ను సందర్శించిన కోటంరెడ్డి గిరిదర్ రెడ్డి

నెల్లూరు రూరల్ మేజర్ న్యూస్....నెల్లూరు రూరల్ నియోజకవర్గ%శీ% పరిధిలోని సౌత్ మోపూర్ గ్రామంలో కనుపూర్ కెనాల్ కి గండి పడిన ప్రాంతాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మంగళవారం సందర్శించారు గండి పడిన ప్రాంతం నుంచే ఇరిగేషన్ యస్.ఇ.కి మరియు జాయింట్ కలెక్టర్ గారికి ఫోన్ చేసి పరిస్థితి వివరించిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. తక్షణ మే చర్యలు తీసుకోవాల్సిందిగా మరియు శాశ్వత పరిష్కారంగా కాంక్రీట్ వాల్ నిర్మించమని కోరడం జరిగినది. పై కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొనడం జరిగినది.

# మిచౌంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి, సహాయక చర్యలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన జిల్లా యస్.పి. డా. కె. తిరుమలేశ్వర రెడ్డి







**నెల్లూరు రూరల్ మేజర్ న్యూస్..** మిచౌంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి, సహాయక చర్యలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన జిల్లా యస్.పి. డా. కె. తిరుమలేశ్వర రెడ్డి.మొదటగా మనుబోలు హైవే, టోల్ ప్లాజా వద్ద వాహనాల రాకపోకలు, రద్దీ పరిస్థితులను ఆరా తీసిన జిల్లా యస్.పి. అనంతరం మైపాడు సముద్ర తీర ప్రాంతంను సందర్శించి, మత్స్యకారులతో ముఖాముఖి మాట్లాడి.. ప్రస్తుత పరిస్థితులు, స్థితిగతులను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. తదుపరి వచ్చి, వెళ్ళే మార్గాలలోని పరిస్థితులను పరిశీలించి, ప్రజా జీవనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని, పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేసిన యస్.పి.ఇతర శాఖలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు చేపడుతున్న నెల్లూరు పోలీసులను అభినందించిన యస్.పి. .వాగులు, వంకలు, నదులు పొంగి పొర్లుతున్నందున ఎలాంటి ప్రమాదం జరగకుండా, ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ భద్రతను కట్టు దిట్టం చేస్తున్నారు.ఈదురు గాలులకు రోడ్లపై విరిగిపడే చెట్లను, కరెంట్ స్తంభాలను వెంటనే తొలగించి, ప్రయాణాలకు, ట్రాఫిక్ నకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశాలు.ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి తాగునీరు ఆహారంతో పాటు వసతి సదుపాయాలను అందించాలన్నారు.నిస్సహాయులైన ప్రజలకు (వృద్ధులు, చిన్న పిల్లలు) స్థానిక యువకులు స్వయంగా ముందుకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించి, తమ తోటి ప్రజలను కాపాడుకోవడం మనందరి బాధ్యత.బలహీనంగా ఉన్న ఇంటి గోడలు, కరెంటు స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్స్, చెట్ల కింద ఉండవద్దు. తాకవద్దు.అధిక నీటి ప్రవాహం ఉన్న రోడ్డులు, బ్రిడ్జిలు, వాగులు, నదులు దాటడానికి ఎవరు ప్రయత్నం చేయకూడదు. తుఫాన్ కారణంగా ఏమైనా అత్యవసర పరిస్థితి వచ్చినా,సంఘటనలు తలెత్తినా ప్రజలు, వెంటనే డయల్ – 100 లేదా ప్రత్యేక పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్: 9392903413 కు సమాచారం తెలపాలని సూచన.

ఇందుకూరుపేట పంచాయతీ ఆఫీస్ దగ్గర ప్రభుత్వ స్కూల్ నందు ఏర్పాటు చేసిన సైక్లోన్ రిలీఫ్ సెంటర్న్ అడిషనల్ డి.యమ్ అండ్ హెచ్.ఓ మరియు జిల్లా క్షయ మరియు లెప్రసీ అధికారి డాక్టర్ యస్.కె. ఖాదర్ వల్లి సందర్శించి పునరావాస కేంద్రం నందు వున్న భాదితులు ఆరోగ్య పరిస్తితి తెలుసుకోవడం జరిగింది... మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో వైద్య సిబ్బందిచే ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరుగుతుంది అని,మంచి



మందులు అందుబాటులో వుంచడం జరిగింది అని,ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చూడడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్ రావు, హెల్త్ సూపర్వైజర్ రమా, సి.హెచ్.ఓ నీలిమ, సచివాలయం హెల్త్ సెక్రటరీ హుసనా, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, అగ్రికల్చరల్ అసిస్టెంట్ దీక్షిత, ఆశా వాలంటీర్లు భాగ్యలక్ష్మి, ,రమణమ్మ పాల్గొన్నారు

# చెన్నైలో జలప్రళయం

### ముంచెత్తిన మిచాంగ్ తుపాను

### ఏకంగా 35 సెంటీమీటర్ల వాన

### పూర్తిగా స్తంభించిన జనజీవనం

### హైవేలు, సబ్వేలు మూసివేత

### నీట మునిగిన విమానాశ్రయం

### 160 విమానాలు రద్దు

### నేడు మరింత వర్ష సూచన!

ఎక్కడ చూసినా నీరే. అంతటా వరద ప్రవాహమే. తమిళనాడు రాజధాని చెన్నై సముద్రాన్ని తలపించింది. బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం మిచాంగ్ తుపానుగా మారి తమిళనాడు రాజధానితో పాటు శివారు జిల్లాల్లో జల ప్రళయమే సృష్టించింది. ఆదివారం రాత్రి నుంచీ ఎడతెరిపి లేకుండా కుంభవృష్టి కొనసాగింది. సోమవారం మధ్యాహ్నానికే చెన్నై, శివారు జిల్లాల్లో 35 సెంటీమీటర్ల వర్షం నమోదైంది! దాంతో వీధులన్నీ వాగులుగా మారాయి

నగరంలో ఎటు చూసినా వరద పోటెత్తింది. ఇళ్లు, పార్కింగ్ ప్రదేశాల్లో ఉన్న వందలాది కార్లు, వాహనాలు వరదల్లో కొట్టుకుపోయాయి! నడుం లోతుకు పైగా నీరు చేరడంతో నగరంలోని అన్ని హైవేలను, సబ్వేలను మూసేశారు. రన్ వేపైకి నీరు చేరడంతో చెన్నై విమానాశ్రయాన్ని కూడా మంగళవారం ఉదయం దాకా మూసేస్తున్నట్టు ప్రకటించారు. 160 విమాన సేవలు రద్దయ్యాయి. వండలూరు జూలోకి వరదనీరు పోటెత్తడంతో పెద్ద సంఖ్యలో మొసళ్లు తప్పించుకున్నాయిదివంగత సీఎం జయలలిత నివాసం, సూపర్స్టార్ రజనీకాంత్ వంటి ప్రముఖులుండే పోయెస్ గార్డెన్ హైవే 7 అడుగుల మేర కుంగింది! అక్కడ టాన్స్ఫార్మర్లు, వాహనాలు అందులో పడిపోయాయి. వాన బీభత్సం కొనసాగుతుండటంతో సహాయ చర్యలూ చేపట్టలేని పరిస్థితి ఉంది. ప్రజలంతా ఇళ్లలోనే బిక్కుబిక్కుమంటున్నారు. మంగళవారం కూడా వర్షాలు కొనసాగుతాయన్న హెచ్చరికలు గుబులు పుట్టిస్తున్నాయి. చెన్నై శివారులోని జాతీయ రహదారి వరద నీటిలో మునగడంతో రాకపోకలు స్తంభించాయి. నగరం, శివార్లలోని చెరువులు, రిజర్వాయర్లు నిండడంతో అడయార్, కూవం నదులు, బకింగ్ హాం కాలువల ద్వారా చెన్నై వైపుగా వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోందినగరాన్ని చుట్టుముడుతున్న వరదను తొలగించేందుకు ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తోంది. చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు జిల్లాల్లో మంగళవారం కార్యాలయాలు, పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తమిళనాడు సీఎం స్టాలిన్తో ఫోన్లో సహాయక చర్యలకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. వేలాది మంది నిర్వాసితులై చెన్నై, శివార్లలో వందలాది శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. వర్షాలకు చెన్నైలో ఐదుగురు మృతి చెందారు. వందలాది రైళ్లు రద్దయ్యాయి

**47 ఏళ్లలో అతి భారీ వర్షం**

తాజా వర్ష బీభత్సం చెన్నై నగరంలో గత 47 ఏళ్లలో అత్యంత భారీ వర్షంగా నమోదైంది. 2015 నాటి కుంభవృష్టిని కూడా మించిపోయింది. అప్పటి కష్టాలు పునరావృతం కాకుండా చూసేందుకు డీఎంకే ప్రభుత్వం నగరంలో రూ.4 వేల కోట్లతో నిర్మించిన వరద కాల్వలు పూర్తిగా వాడకంలోకి రాకపోవడంతో ఈసారీ ముంపు సమస్య తలెత్తింది. మంగళవారం నాటికి 10 సెం.మీ. వర్షపాతం నమోదు కావచ్చని వాతావరణ కేంద్రం పేర్కొంది

## ఆకలితో అలమటించే వారికి ఆకలి తీర్చిన నారాయణ

### - తుఫాను ప్రభావంతో నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన టిడిపి శ్రేణులు

### - ఆహారం.. ఇంటి పై కప్పుల పట్టలు అందజేత



**నెల్లూరు రూరల్ మేజర్ న్యూస్..** మీచౌంగ్ తుఫాన్ కారణంగా నెల్లూరు ప్రజల జనజీవనం అస్తవ్యస్తమైంది. తుఫాను ప్రభావంతో నెల్లూరు శివారు ప్రాంత నిరుపేద ప్రజలు పడుతున్న కష్టాలను క్షేత్రస్థాయిలో టిడిపి శ్రేణులు గుర్తించారు. మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు శివారు ప్రాంతాల్లోని నిరుపేద ప్రజలను ఆదుకునేందుకు టిడిపి నాయకులు నడుం బిగించారు.తుఫాన్ కారణంగా నెల్లూరు నగరంలోని నిటమునిగిన పలు ప్రాంతంలను టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ ప్రాంతంలోని పూరి గుడిసెలు తడిచి వర్షపు నీరు కారుతున్న ఇళ్ల యజమానులకు మాజీ మంత్రి పొంగూరు నారాయణ దాతృత్వంతో అందజేసిన పట్టలను..ఆహారంను టిడిపి శ్రేణులు అందజేశారు. తుఫాన్ కారణంగా వర్షపు నీటితో అవస్థలు పడుతున్న ప్రజల బాధలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టిడిపి శ్రేణులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు కారణంగా నేడు పేద ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో టిడిపి అందరికీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు షేక్ కరిముల్లా, నగర అధ్యక్షుడు మామిడాల మధు.మాజీ మునిసిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేత రెడ్డి,టీడీపీ ముఖ్య నేతలు నాయకులు పాల్గొన్నారు..

## సౌత్ మోపూరులోని కనుపూరు కెనాల్ పెద్దతూమును పరిశీలించిన ఆనం, కొండ్రెడ్డి

### భారీ వర్షాలకు కొట్టుకుపోయిన పెద్దతూము శాశ్వత పరిష్కారం కోసం సమస్యను యంపి ఆదాల దృష్టికి -ఆనం

### ఎంపీ ఆదాల ద్వారా త్వరలోనే శాశ్వత పరిష్కారం -ఆనం

### సౌత్ మోపూరు రైతులకు ఆనం, కొండ్రెడ్డి హామీ

**నెల్లూరు రూరల్ మేజర్ న్యూస్..** గడచిన మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురిసిన మిచాంగ్ భారీ వర్షాలకు నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపురు గ్రామంలోని కనుపూరు కెనాల్ పెద్దతూము నీటి ప్రవాహంలో కోతకు గురై కొట్టుకుపోయింది. ఆ గ్రామ రైతులు సమాచారమును ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగింది. రైతుగా విజ్ఞప్తికి స్పందించిన ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి సౌత్ మోపూరు గ్రామానికి వెళ్లి పరిస్థితిని తెలుసుకోవాలని డిసిసిబి మాజీ అధ్యక్షులు ఆన విజయ కుమార్ రెడ్డి, విజయ డైరీ చైర్మన్ కొండ్రేడ్డి రంగారెడ్డిలకు సూచించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం సౌత్ మోపూర్ లోని కనుపూరు కెనాల్లో నీటి ప్రవాహంలో కోతకు గురైన పెద్దతూము ప్రదేశంను స్థానిక రైతులు, గ్రామ ప్రజలతో కలసి డిసిసిబి మాజీ అధ్యక్షులు ఆన విజయ కుమార్ రెడ్డి, విజయ డైరీ చైర్మన్ కొండ్రేడ్డి రంగారెడ్డిలు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులను ఉద్దేశించి డిసిసిబి మాజీ అధ్యక్షులు ఆన విజయ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సమస్యను శాశ్వతంగా పరిష్కారిం చేందుకు పెద్దలు యంపి, రూరల్ ఇంచార్జీ ఆదాల ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి వివరించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు చేరెడ్డి ప్రభాకర్ రెడ్డి, స్వర్ణ వెంకయ్య, సిహెచ్ హరిబాబు యాదవ్, వేలూరు శివసునీల్ రెడ్డి, పాలకీర్తి రవికుమార్, వేలూరు శ్రీధర్ రెడ్డి, ముడియాల రామిరెడ్డి, కొండేటి శివారెడ్డి, సిహెచ్ సూరిబాబు, వై శ్రీనివాసులురెడ్డి, సౌత్ మోపురు గ్రామ వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు

# పొర్లుకట్ట, జయలలిత నగర్ లో పర్యటించిన అబ్దుల్ అజీజ్





నెల్లూరు,మేజర్‌న్యూస్: నెల్లూరు నగర నియోజకవర్గం 48 వ డివిజన్ లోని పొర్లుకట్ట, జయలలిత నగర్ లో నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ పర్యటించారు. మాజీ మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో అక్కడ నివసిస్తున్న ప్రజలకు ఇంటి పై కప్పుకునెందుకు టార్పాల్ పట్టలు అందించారు. వెంటనే ఈ ప్రదేశాలను ఖాళీ చేయాలని టీడీపీ హయాంలో మంజూరు చేసిన టిడ్కో ఇళ్లకు వెళ్లిపోవాలని సూచించారు. ఇళ్లు ఇవ్వని వారి గురించి కమిషనర్, కలెక్టర్ లతో మాట్లాడి వెంటనే వారికి ఇళ్లు ఇచ్చే ఏర్పాటు కు కృషి చేస్తామని తెలిపారు. ఈ సంధర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ ప్రభావం నెల్లూరు పై తీవ్రంగా పడిందని సోమశిల లో నీరు అధికంగా ఉండి ఉంటే ఈ ప్రాంతాల పరిస్థితి చాలా దారుణంగా ఉండేదని అన్నారు. గత ఐదేళ్ల కింద మంజూరు చేసిన టిడ్కో ఇళ్లను ఇప్పటికీ ఇవ్వకపోవడం ప్రభుత్వ తప్పిదమని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఇక్కడి నుంచి వెళ్తే తమ దినచర్య కు నష్టం కలుగుతుందన్న భ్రమ లో ఉన్నారని వీరికి కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాల పై ఉందని అన్నారు..కలెక్టర్, కమిషనర్ లు టెలీ కాన్ఫరెన్స్ లు ఒక్కటే తీసుకుంటే సరిపోదని ప్రజలకు తాము ఉన్నామన్న భరోసా ఇవ్వాలని అన్నారు. చెట్లు ఒరిగి దాదాపు 12 గంటల నుండి నిరంతరంగా కరెంట్ లేదని, వారం నుండి తుఫాను వస్తుందన్న సమాచారం ఉందని విద్యుత్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని ఉండాల్సిందని అన్నారు. కనీసం రెండు మూడు గంటలకు ఒకసారి కరెంట్ ఇచ్చే ప్రక్రియను చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు.

# విద్యుత్ పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన పనులు





## - స్పెషల్ ఆఫీసర్ హరికిరణ్

నెల్లూరు కలెక్టరేట్ (మేజర్ న్యూస్) మీచౌంగ్ తుఫాను నేపథ్యంలో నెల్లూరు నగరంలో దెబ్బతిన్న విద్యుత్ ను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నట్లు తుఫాను జిల్లా ప్రత్యేక అధికారి హరి కిరణ్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నుండి తుఫానుకు దెబ్బతిన్న ప్రాంతాలను జిల్లా కలెక్టర్ యం హరి నారాయణన్, మున్సిపల్ కమీషనర్ వికాస్ మర్మత్ లతో కలసి పరిశీలించారు.సోమవారం అర్ధరాత్రి జిల్లాకు చేరిన ప్రత్యేక అధికారి వెనువెంటనే జిల్లా కలెక్టర్ తో కలసి సమావేశమై తుఫాను సన్నద్ధత చర్యలను చర్చించారు. మంగళవారం ఉదయం నుండి నెల్లూరు నగరంలోని కెవిఆర్ పెట్రోల్ బంక్, ఆత్మకూరు బస్టాండ్ దగ్గర అండర్ బ్రిడ్జ్, విజయమహల్ గేట్ అండర్ బ్రిడ్జ్, రామ్మూర్తి నగర్ లోని మున్సిపల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సహాయ పునరావాస కేంద్రంను పరిశీలించారు. శిబిరాల్లో తలదాచుకున్న ఇతర రాష్ట్రాల వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా శిబిరంలో తలదాచుకున్నవారు మాట్లాడుతూ, నగరంలో పుల్కా బండ్లు, రోళ్లు తయారీ చేస్తూ జీవనోపాధి పొందుతామని, ఓవర్ బ్రిడ్జిల కిందే నివాసముంటామని, మాలాంటి వారిని కూడా గుర్తించి ప్రత్యేక శిబిరంలో చేర్చి భగవంతునిలా ఆదుకుంటున్న ప్రభుత్వానికి తమ ధన్యవాదాలన్నారు. అనంతరం మాగుంట లే అవుట్ అండర్ బ్రిడ్జి ని పరిశీలించారు. రోడ్లపై నేలకొరిగిన చెట్లను యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్న సిబ్బంది కి తగు సూచనలు అందిస్తూ ముందుకు సాగారు.అనంతరం నిండుకుండలా ఉన్న సర్వేపల్లి రిజర్వాయర్ ను పరిశీలించి, నీటమునిగిన పంట పొలాలను చూసి రైతులతో మాట్లాడారు. అనంతరం కనుపూరు చెరువును పరిశీలించి, వెంకటాచలం మండలం కులతీగలపాడు గ్రామం వద్ద, అదేవిధంగా సౌత్ మోపూరు వద్ద గండి పడిన కనుపూరు కాలువను పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి హరి కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో తుఫాను ముందస్తు చర్యలు పకడ్బందీగా చేపట్టినందువల్ల ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. తుఫాన్లు సంభవించినప్పుడు ఏ ఒక్కరి ప్రాణం పోకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఒక్క రాత్రి లోనే తీవ్రంగా నష్టపోయిన నెల్లూరు నగరంను వేగవంతంగా పునరుద్దరణ చర్యలు చేపట్టామన్నారు. సహాయ శిబిరాల్లో ఉన్న వారికి మంచి భోజన వసతితో పాటు ప్రభుత్వ ఆదేశాల మేరకు కుటుంబానికి 2500/- చొప్పున, వ్యక్తులకు 1000/- వంతున అందజేస్తామన్నారు. వ్యవసాయపరంగా జిల్లాలో పంటలు నారుమడి దశలో ఉన్నాయని, నష్టపోయిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ కింద విత్తనాలు అందిస్తామన్నారు. రైతులు అధైర్యపడవద్దని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. అదేవిధంగా నగరంలో విద్యుత్ పునరుద్దరణ కు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# పునరావాస కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

## - జిల్లా కలెక్టర్ హరి నారాయణన్



నెల్లూరు కలెక్టరేట్ (మేజర్ న్యూస్) తుఫాన్ తీరం దాటిన నేపథ్యంలో అధికారులు పునరావాస, సేవల పునరుద్ధరణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ యం. హరి నారాయణన్, అధికారులను ఆదేశించారు. మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో చేపడుతున్న సహాయ మరియు పునరావాస కార్యక్రమాల ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ హరి నారాయణన్, జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పునరావాసా కేంద్రాలను కొనసాగిస్తూనే దెబ్బతిన్న రోడ్లు క్లియరెన్స్, విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనులను ముమ్మరం చేసి రేపటిలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సహాయక, పునరావాస కార్యక్రమాల్లో పాల్గొను గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయి సిబ్బంది ఈ రోజు కూడా అప్రమత్తంగా వుంటూ పనిచేస్తున్న ప్రదేశంలోనే వుండాలని జిల్లా కలెక్టర్, అధికారులకు సూచించారు. ముఖ్యంగా కొన్ని కాజ్ వే ల వద్ద వరద నీటి ఉధృతి ఎక్కువగా వున్నందున ఆయా కాజ్ వే ల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని జిల్లా కలెక్టర్, అధికారులకు సూచించారు.

## ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

### - కాంగ్రెస్ పార్టీ నేత అనిల్ కుమార్ రెడ్డి



నెల్లూరు,మేజర్‌న్యూస్: తుఫాను నేపథ్యంలో ఉదయగిరి ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గం నేత సోము అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీలైనంతవరకు ప్రజలు నివాసాలకే పరిమితం కావాలి సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతవాసులు జాగ్రత్తగా ఉండాలి కోరారు. వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలలో అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి..సర్వం కోల్పోయిన బాధితులను వెంటనే ఆదుకోవాలని తెలిపారు. రోడ్ల మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలన్నారు. అనేక గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.. దీనిని వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ ప్రభుత్వం బాధితులను అన్ని విధాల ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



నెల్లూరు ,మేజర్ న్యూస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసి)ద్వారా ఎర్రగడ్డలు, ఉల్లిగడ్డలు తుఫాను బాధితులకు అందజేసేందుకు నెల్లూరు మార్కెట్లో ప్యాకేజింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వర్ రెడ్డి సెక్రటరీ ఉమాపతి రెడ్డి ,సిబ్బంది.

## కిసాన్ క్రెడిట్ కార్డులపై ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



నెల్లూరు, కలెక్టరేట్ ( మేజర్ న్యూస్ )రాజ్యసభ సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్లమెంటులోని రాజ్యసభలో కిసాన్ క్రెడిట్ కార్డులపై పలు ప్రశ్నలు వేశారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం కింద రైతులకు పూచీకత్తు లేని రుణాన్ని రూ.1.6 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పెంచడం, కే సి సి కింద తీసుకున్న రుణానికి 7 శాతం వడ్డీ వసూలు చేయడం కూడా వాస్తవమేనా? కేసిసి లో రూ. 4 లక్షల వరకు వడ్డీని 7 శాతం నుంచి 5 శాతానికి తగ్గించే ప్రతిపాదనలు, 3 శాతం తిరిగి చెల్లింపు ప్రోత్సాహకాల వంటి అంశాలపై రాజ్యసభలో ప్రశ్నలు వేశారు. ఈ ప్రశ్నలకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి డా.భగవత్ కరద్ సమాధానమిచ్చారు. రైతులు, ప్రజాప్రతినిధులు కిసాన్ క్రెడిట్ కార్డు పథకం కింద రైతులకు పూచీకత్తు లేని రుణాన్ని పెంచడంపై ఎలాంటి ప్రతిపాదనలు అందలేదని అన్నారు. ఆర్బిఐ ప్రకారం 2022 నవంబర్ 23 నుంచి కిసాన్ క్రెడిట్ కార్డ్ కింద రైతులకు బ్యాంకులు 7 శాతం వడ్డీ అమలు చేస్తున్నట్లు చెప్పారు. అయితే కిసాన్ క్రెడిట్ కార్డ్ (%ఖజజ%) పథకం కింద రైతులకు పూచీకత్తు లేని రుణ పెంపు, వడ్డీ రేటు తగ్గింపుపై ఎలాంటి ప్రతిపాదనలు లేవన్నారు. %ఖజజ% ద్వారా స్వల్పకాలిక పంట అనుబంధ కార్యకలాపాల కోసం ₹3 లక్షల వరకు కోసం రైతులకు రుణాల అందించబడుతున్నాయన్నారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు గాను రైతులకు వర్తించే రుణ రేటు, ఆర్థికపరమైన వడ్డీ రాయితీ రేట్లు వరుసగా 7%, 1.5% గా ఉన్నాయన్నారు. తిరిగి చెల్లింపు ప్రోత్సాహకం , రుణాలు సకాలంలో తిరిగి చెల్లించడం కోసం అదనంగా 3% ప్రాంప్ట్ ఇవ్వబడిందని అన్నారు. అందువలన, పంపిణీ తేదీ నుండి ఒక సంవత్సరం వ్యవధి ఉన్న రుణాలకు గరిష్టంగా వడ్డీ రేటును సంవత్సరానికి 4%కి తగ్గించడం జరుగుతుందన్నారు.